# చుట్టాలొస్తున్నారు జాగ్రత్త!

విజయ్ నెయ్యి కోసం నాలుగు గంటల సేపు క్యూలో పడిగాపులు పడి చివరకు ఖాళీ డబ్బాతోనే ఇంటికి తిరిగివచ్చిన రాధకు ఇంటిముందు ఒక రిక్షా, కూర్చున్న తన పిన్ని ఆవిడ పక్కన పెట్టె బేడా కనిపించాయి. గుండె గుభేలుమంది. నిన్ననే కదా చుట్టాలు వెళ్ళింది. నెలకు సరిపడా సామాన్లు తెచ్చుకుంటే చుట్టాల పుణ్యమా అని అవి కాస్తా అడుక్కి చేరుకుంటే కానిన్ని సరుకులూ, కొద్దిపాటి నెయ్యి కొనుక్కుందామని బజారుకు వెళ్ళింది రాధ. మళ్ళీ ఇప్పుడే చుట్టాలా! చూడబోతే కొన్నాళ్ళ పాటు వుండేలా అనిపించింది రాధకు. అంతే, మతి పోయినట్లయింది. ఇంతలో ''ఎలా వున్నావే తల్లీ'' అన్న పిన్నిగారి కుదుపుతో మళ్ళీ ఈ లోకంలోకి వచ్చింది రాధ. ''నిన్ను చూడాలనిపించింది. పెంచిన ప్రేమకదా. అందుకే నీ దగ్గర ఓ పదిరోజులు వుండి పోదామని బాబయ్యగారిని తీసుకుని వచ్చేశాను'' అంది పిన్ని. 'పెంచిన ప్రేమ ఆపేక్షల మాట ఎలావున్నా మాటిమాటికీ వచ్చే చుట్టాలకు చేసిపెట్టలేక నా దుంప తెగిపోతోంది' అనుకుని రాధ బాధను గుండెల్లోనే అదుముకుని పిన్ని, బాబయ్యల సేవలో మునిగిపోయింది.

అసలు రాధకే కాదు. అస్తమానూ చుట్టాలు వచ్చేపోయే ఇల్లయితే రాధలా ఆ ఇల్లాండ్లందరికీ వస్తుందా గుండెమంట. ఏదో చుట్టాలువచ్చిపోతున్నారు. వారికి చాకిరీ చేయలేనని కాదు. వచ్చినవారికి మన చాలీ చాలని జీతాల్లో ఎంతకని సర్దుబాటు చేయగలమన్నదే వారి తపనగా మనం అర్థం చేసుకోవాలి. అందునా, మధ్యతరగతి కుటుంబీకులకు నిజంగా ఇదొక రకం ఈతిబాధేనని చెప్పాలి.

పూర్వం రోజుల్లో అతిథీ, అభ్యాగతీ అంటూ ఇంటికి వచ్చిన చుట్టాన్ని ఆదరించి, తమకున్నా లేకున్నా వారి కడుపునింపి వారిని సంతృప్తి పరచి సపర్యలు చేయడమే గృహస్థు బాధ్యత అంటుండేవారు. గృహిణి బాధ్యతల్లో అత్యున్నతమైనది అతిథి అభ్యాగతుల సేవ అనీ, ఇటువంటి బాధ్యత నెరవేర్చే గృహిణి సద్గుణ సంపన్న అని, ఇలా బిరుదులు పెలామణీలో వుండేవి. ఆ పేరు ప్రతిష్టలకోసం ఉవ్విళ్ళూరడం కూడా ఆనాటి గృహిణుల ఆశగానేవుండేది. అంతేకాక మాయింటికే నలుగురూ వస్తు పోతుంటారు. తీసే విస్తరీ, వేసే విస్తరీ అనుకుంటూ నలుగురిలో చెప్పుకుని సరదాపడి, గర్వపడుతుండేవారు కూడాను. అయితే ఆరోజులు వేరు. పండిన గింజలన్నీ తాము తినగా తమ క్రింద పనిచేసే వారికి ఇతరులకూ దానధర్మాలు చేయగా పోను మిగిలినవి అమ్ముకుని సంపన్న జీవనం గడుపుతుండేవారు. పొలంలో పండే కాయ ధాన్యాలు పెరట్లో పండే కాయగూరలతో. దీనితోపాటు పాడి. దేనికీ కొదవలేకుండా కాలం సుఖంగా వెళ్ళిపోతుండేది. ఎంతమంది వచ్చి తినిపోతున్నా ఇబ్బంది వుండేది కాదు. సరుకుల ఖరీదులు

మనకు అందుబాటులో వున్న రోజులు. ఈ నాడు ఆ రోజులుపోయి ధరలు ఆకాశాన్నంటే కాలం వచ్చిపడిందే. ఇదేకాదు. డబ్బులుపారేసి కొనుక్కుందామా పోనీ అంటే దొరకనివి ఎన్ని...భర్త నెలజీతాని కనుగుణంగా గుట్టు చప్పుడు కాకుండా ఇల్లు సర్దుకుపోయే ఇల్లాలికి ఎప్పుడూ చుట్టాలు వస్తుంటే ఆ ఇల్లెట్లా గడుస్తుంది. గుట్టు చప్పుడు కాని సంసారంలో రొడ సొదలు వినిపించక పోతాయా? జీతానికి సరిపడే ఇంటి బడ్జెట్ వేసుకుని తదనుగుణంగా ఇల్లు దిద్దుకునే వారింట్లో చుట్టాల బెడద వల్ల బడ్జెట్ తారుమారయి వచ్చే జీతం రాళ్ళు చాలక చివరికి ఆ బంధువులు వెళ్ళాక ఆ భార్యాభర్తల మధ్య తగవు ప్రారంభమయి మనసులో చీకాకు జనిస్తుంది. వచ్చిన చుట్ట పక్కాలు నవ్వుతూ నాలుగు రోజులుండి వెళ్ళిపోతారు. చాలీచాలని జీతాలతో జీవితాలు దొర్లించలేని మధ్య తరగతి ఉద్యోగి బ్రతుకు దుర్భరంగా మారిపోతుంది.

ఇక ఈ చుట్టాలు పలురకాలమంది. కొందరు చుట్టపుచూపుకింద వస్తారు మరి కొందరు ఇంటర్వ్యూకోసమనో, పనిచూసుకు పోవడానికనో లేక పెళ్ళి సంబంధాల వేటలో భాగంగానో, వచ్చిపోతుంటారు ఇక పెళ్ళిళ్లకు వచ్చేవారి సంగతి వేరు. కొందరికి అవతలివారింట్లో వుండివెళ్తున్నామే అని బాధ కొంచెం లోపలవున్నా, మరేంచేయలేక గత్యంతరంలేక మరొకరి ఇంటికి చుట్టంగా వెళ్లవలసి వస్తుంది. వీరిలో మొహమాటం పాలు ఎక్కువగానే వుంటుంది కూడా. ఇలాంటివారు తాము తమ ఋణాన్ని ఏదో విధంగా చెల్లించుకునే వెళ్ళుతారు. వీరితో మనమూ సర్దుకు పోవచ్చు. ఇటువంటివారు ఎక్కువ రోజులు మన ఇంటి అతిథులుగా వుండరు. మనమూ చల్లగానే చూస్తాం. సునాయాసంగానే గడిచిపోతుంది. కానీ మరో రకం వారున్నారు. వాళ్ళింటికి వెళ్ళి వూరు అదీ చూసి రావచ్చు. పిల్లల సెలవలు, గడిచినట్లుంటుందని బయలు దేర్తారు. పాపం అవతలి వారికి కష్టమెమోనని మనసెక్కడయినా పీకితే దానిని అణగదొక్కి, ఏం ఆమాత్రం పోషించలేరు. పోషించకేం చేస్తారు. వాళ్ళు మనింటికి రారా? అనుకుంటూ సరిపెట్టుకుని సామాన్లు సర్దుకుని ప్రయాణం కడతారు. వీరికి అతిధి మర్యాదల పట్టింపు కూడా వుండటంవల్ల వీరికి అతిధ్యం ఇచ్చే గృహస్థుల పని చివరికి గోవిందా అవుతుంది. ఆ పట్టణాన్ని చూపించే ఖర్చులన్నీ వీరే భరించి దీనికి తోడు, అతిధి సత్కారాలకు కూడా ఎటువంటి లోపమూ రానీకుండా ఎంతో ఇదిగా చేసుకుపోయినా చివరికి ఏదో ఒక నిష్ఠూరం వారికి ఎదురయి 'ఎందుకొచ్చిన చుట్టాలురా భగవంతుడా' అని ఆగృహస్తులు విచారించ వలసివస్తుంది. వెళ్తుంటే బట్టలు కూడా పెట్టలేదని ఆ చుట్టాలు నిష్టూరమాడి జీవితాంతం దెప్పుతుంటే అది మరింత దుర్భరం.వీరు కాక వారిని భోజనానికి పిల్చామని అప్పుడప్పుడు, ఒకసారి ఎప్పుడు శ్రీవారు భార్యామణి చెవిన వేస్తే ఆవిడకు అరికాలుమంట నెత్తికొచ్చి అంతెత్తు ఎగురుతుంది. దీనికి కారణం వాళ్ళువచ్చి తిని పోతున్నారని కాదు బాధ. వచ్చినవారికి చేసి పెట్టలేక పడే ఇబ్బంది మాత్రమే. అయితే శ్రీవారు మాట ఇచ్చాక ఏం లాభం చివరికి ఆయన్ని మనసులో తిట్టుకుంటూ, వాళ్ళకు బుద్ధి లేదూ ఎప్పుడూ మాయింటికే భోజనానికి

వస్తారని అచుట్టాలకి కూడా దీవెనలిస్తూ ఆరోజుకెలాగో వండి పడేస్తుంది ఆ ఇల్లాలు. అయితే భోజనాలయి చుట్టాలు గడప దాటకా వుంటుంది తగాదా ... కాస్త ముందు చూపువున్న మగాడు ముసుగుతన్ని నిద్రపోయినట్లు నటించి తప్పుకుంటాడు. అది తెలియనివాడు ఆవిడచేత రెండు తిట్లుతిని చాతనయితే తాను కూడా ఆవిడ్ని తిట్టి చిన్న రభస చేస్తారు.

ఇలా చుట్టాల మూలకంగా ఒక్కోసారి ఎన్నో పరిణామాలు ఎదురౌతాయి. అందువల్ల ఇటువంటి పరిణామాల నెదుర్కొన్న వారు తమ బాధ్యత తెలుసుకుని అవతలి అతిధిగా ఎలామసలాలో నేర్చుకుంటే కొన్నాళ్ళకి ఆ అవతలి వారిలోకూడా మార్పు వస్తుంది. మనం ఒకరింటి అతిధిగా వెళ్ళామంటే వారు మనం వచ్చామని బాధపడక, మనం వారింటికెప్పుడూ రావాలనుకునేలా వుండాలి. అతిధిగా మనం వెళ్ళేటప్పుడు అవతలి సంసారం మంచి చెడ్డలు తెలుసుకుని, మనం వెళ్ళటం వల్ల వారికేమయినా ఇబ్బంది కలుగుతుందా అన్న విషయం ఆలోచించి బాధ్యతలను గుర్తెరిగి అతిధి అభ్యాగతులు వ్యవహరించినప్పుడే రాధలాంటి వారికి చుట్టాలని చూస్తే ప్రాణాలు పైపైకి పోనవసరంలేదు. ఆదరంగా వారికి స్వాగతం పలికే అవకాశం లభిస్తుంది. *

—జ్యోతి




కొత్తగా కనుగొన్న అద్భుతయంత్రం
(హోమ్ సినీమా ప్రొజెక్టర్)

ఇంట్లోనే కూర్చొనిరంగుల ఫిల్ముల్లో నృత్యాలు, నటనా సన్నివేశాలు తిలకించండి. విద్యుచ్ఛక్తి గాని, బ్యాటరీతోగాని పనిచేసే ఈ సినీమా ప్రొజెక్టర్ ఖరీదు 30 రూపాయలు మాత్రమే. పోస్టేజి ఖర్చులు రూ.7-50 పై. అదనం. జర్మన్ మోడల్ (సూపర్) ధర 45 రూపాయలు. పోస్టేజి ఎనిమిదిన్నర. రిఫ్లెక్టర్ స్క్రీన్ 5రూపాయలు. ఈ ప్రొజెక్టర్లలో 35 మిల్లీమీటర్ల ఫిలిం ఉపయోగించవచ్చు. ప్రొజెక్టర్‌తోపాటు 25 గజాల నిడివిగల ఫిలిం, ప్రొజెక్టర్‌ను ఉపయోగించే పద్ధతిని తెలిపే పుస్తకం ఉచితంగా లభిస్తుంది. అదనంగా ఫిలిం 25 పై॥కు గజం.

**ఆరుషాట్ల పిస్తోలు**
(లైసెన్సు అవసరంలేదు)

రష్యన్ మోడల్ ఆటోమేటిక్ పిస్తోలుతో దొంగలు, క్రూరమృగాల బారినుండి ఆత్మరక్షణ చేసుకోండి. డ్రామానటులు, సర్కస్‌వారికి కూడా మిక్కిలి ఉపయోగకరం. పిస్తోలుతో పాటు వంద తూటాలు ఉచితం. నెం. 555 పిస్తోలు ధర రూ. 14-50. డీలక్సు (నెం. 777) ఖరీదు రూ. 24. బెల్టుతో క్రోమ్ లెదర్ కేసు (సూపర్) రూ. 10. ఎక్స్‌ట్రా తూటాలు నూటికి 2 రూపాయలు. పోస్టేజి అదనము. ఇంగ్లీషు, లేదా హిందీలో వ్రాయండి.



**Vijay Agencies**
**Chhapeti, Aligarh (U. P.)**